నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | NIRMAL

వ్యవసాయ విజ్ఞానాన్ని అందించాలి..

నిర్మల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 19 : రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్ అన్నారు. సోమవారం నిర్మల్‌లో నూతనంగా ఎన్నికైన ఏఈవోల సంఘం కార్యవర్గం ఆధ్వర్యంలో అంజిప్రసాద్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి హర్షిత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గ నియామక పత్రాన్ని అందిస్తున్న ఏఈవోలు

అభివృద్ధికి సహకరించండి..

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను అధికారులు ఆపేశారు. దీంతో సోమవారం ఆ ప్రాంతం వారు నిర్మాణ పనుల వద్ద ధర్నా చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ అక్కడికి చేరుకుని మాట్లాడారు. అభివృద్ధి పనులకు అంతరాయం కలుగకుండా చూడాలని వ్యాపారస్తులను విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్-మహారాష్ట్రకు నిరంతరం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని.. వాహనదారులు, స్థానికులకు ఇబ్బంది కలుగకుండా చూస్తామని తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

వేతనాలు మహాప్రభో..

- మూడు నెలలుగా అందని జీతాలు
- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ) : మాతా, శిశువుల ఆరోగ్యం, వారి రక్షణలో కీలక పాత్ర వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు జీతాల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకున్నది. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదంటూ సోమవారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,280 అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండగా.. వీరిలో 992 మంది మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 288 మంది మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే వారికి ప్రతి నెలా రూ.13,500, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే వారికి రూ.7,500 వేతనం ప్రభుత్వం చెల్లిస్తున్నది. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఈ చిరు ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. తమ వేతనాలను మంజూరు చేయాలని అధికారులను పలుమార్లు కలిసి విన్నవించినా ఫలితం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతాలను ఇప్పించాలంటూ సోమవారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించి ఆర్డర్ కాపీలు ఇచ్చారని ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం ఇవ్వలేదని తెలిపారు. పదో తరగతి చదివినా ఆయాలకు టీచర్ పోస్టులు ఇవ్వాలని, మే నెలలో ఎండాకాలం సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ ఆందోళనలో తెలంగాణ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, నాయకులు, లింగన్న, స్వామి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకటన్న, రత్నమాల, సునీత, సుభద్ర, ముక్తా, రాధ, కౌసల్య, రాధమ్మ, పద్మ పాల్గొన్నారు.

హత్య చేసిన నిందితుడిని శిక్షించాలని తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రేమోన్మాదిని శిక్షించాలి..

అలేఖ్యను హత్య చేసిన శ్రీకాంత్‌కు ఉరిశిక్ష విధించాలి..

- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్
- ఖానాపూర్ పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా

ఖానాపూర్, ఫిబ్రవరి 19 : పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన షేట్‌పెల్లి అలేఖ్యను అతి కిరాతకంగా నడిరోడ్డుపై దారుణంగా హత్య చేసిన జూకింది శ్రీకాంత్‌ను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో మహిళా సంఘాలు, విద్యార్థులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కరువైందని, ఇలాంటి ఘటనలకు పాల్పడిన వ్యక్తులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి తక్షణం శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 8వ తేదీన అలేఖ్యను హత్య చేసిన శ్రీకాంత్‌కు ఊరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. హత్యకు ప్రేరేపించిన వారిని గుర్తించి కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో నాయకులు రామయ్య, ఫిటర్, రాజేశ్, రాకేశ్, సతీశ్, రాజ్‌కుమార్, శ్యాం, అశోక్, సంతోశ్, శంకర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలు అందేనా..!

- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పంచాయతీలకు టీ-ఫైబర్ కనెక్షన్
- ఇంటర్నెట్ సదుపాయం కల్పించని కాంగ్రెస్ సర్కారు
- ఆన్‌లైన్ సేవలకు దూరమవుతున్న పల్లె ప్రజలు

నిర్మల్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ) : మారుమూల గ్రామాల్లోని ప్రజలకు పారదర్శకంగా సేవలను అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఈ-గవర్నెన్స్ విధానాన్ని తీసుకొచ్చి ప్రతి సమస్యకు పేపర్ రహితంగా ఆన్‌లైన్‌లో పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రతి పంచాయతీలో కంప్యూటర్‌ను ఏర్పాటు చేసి, హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా టీ-ఫైబర్ ద్వారా అన్ని గ్రామాలకు కేబుల్ కనెక్టివిటీ పూర్తి చేసింది. పంచాయతీల్లో సేవలన్నీ సులభంగా, వేగంగా అందించేందుకు, అలాగే ప్రతి ఇంటికి నెట్ సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పైప్‌లైన్లతోపాటు, ఫైబర్ నెట్ కేబుళ్లను అండర్ గ్రౌండ్ ద్వారా వేశారు. జిల్లాలో 19 మండలాల పరిధిలో 396 పంచాయతీలు ఉండగా, దాదాపుగా అన్ని గ్రామాలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ పనులు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. అయితే గతేడాది ఆగస్టు నాటికి ఈ పనులన్నీ పూర్తికాగా, ఆయా పంచాయతీలకు ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించాల్సి ఉంది. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఇంటర్నెట్ కనెక్టివిటీ పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోలేదు. గ్రామాల్లో పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా సేవలందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చించి పంచాయతీల్లో అవసరమైన కంప్యూటర్ పరికరాలు, బ్యాటరీలను, ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా పంచాయతీలకు కేవలం ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తే ఆయా పరికరాలు ఉపయోగంలోకి రావడమే కాకుండా, ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది.

సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే..

గ్రామ స్థాయిలో ప్రతి అధికారికి జవాబుదారీతనం ఉండేలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం అన్ని పంచాయతీలకు టీ-ఫైబర్ ద్వారా కేబుల్ లైన్ వేసింది. వీటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తే ఇక గ్రామాలన్నీ ఈ-గవర్నెన్స్‌లోకి వెళ్తాయి. దీంతో ప్రజలు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని.. తమ పని ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్నదో తెలుసుకునే అవకాశం ఉంది. సదరు అధికారి సమస్యను పరిష్కరించకుంటే ఉన్నతాధికారులకు ఆన్‌లైన్‌లోనే వారిపై ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో అధికారులు అన్ని ఫైళ్లను ఆన్‌లైన్ ద్వారానే పరిష్కరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి అంశానికి సంబంధించి తహసీల్దార్ స్థాయి నుంచి ఆర్డీవో, కలెక్టరేట్ ఏవో, డీఆర్‌వో, అదనపు కలెక్టర్లతో పాటు కలెక్టర్ ప్రతి ఫైల్‌ను ఆన్‌లైన్‌లోనే చెక్ చేస్తున్నారు. అంతే కాకుండా ఈ-గవర్నెన్స్ విధానం ద్వారా ఫైళ్లు మిస్ అయ్యే అవకాశాలు కూడా ఉండవు. గతంలో కింది స్థాయి నుంచి కలెక్టరేట్ వరకు ఫైళ్లను ప్రత్యేక మెసెంజర్స్ ద్వారా పంపాల్సి వచ్చేది. ఈ-గవర్నెన్స్ ద్వారా ఫైళ్లను వేగంగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే కేసీఆర్ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది.

ఫిర్యాదులు చేయడం సులభతరం

ఇప్పటి వరకు పల్లె జనం తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని వినియోగించుకునేవారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు. ప్రతి శాఖకు సంబంధించిన సమస్యకు ఆన్‌లైన్‌లోనే పరిష్కారం పొందే అవకాశం ఉన్నా.. దానిని పెద్దగా ఉపయోగించుకోవడం లేదు. టీ-ఫైబర్ ద్వారా ప్రజావాణికి వెళ్లకుండానే తమ గ్రామాల్లోని పంచాయతీల్లో ఏర్పాటు చేసే కంప్యూటర్ ద్వారా తమ ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో మీ-సేవా కేంద్రాలు లేకపోవడం, మండల కేంద్రాల్లో ఉన్న మీ-సేవా ఆపరేటర్లకు అవగాహన లేకపోవడంతో సమస్యల పరిష్కారానికి కొన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఈ సమస్యలన్నీ దూరం కావాలంటే వెంటనే గ్రామ పంచాయతీలకు ఇంటర్నెట్ కనెక్షన్ సదుపాయాన్ని కల్పించాలని పల్లె ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



ఇంటర్నెట్ కనెక్షన్ లేక లక్ష్మణచాంద పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న పరికరాలు

మాజీ మంత్రి అల్లోల సోదరుడు మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు

సోన్, ఫిబ్రవరి 19 : నిర్మల్ మండలంలోని ఎల్లపెల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, తిరుమల థియేటర్ వ్యవస్థాపకులు అల్లోల హన్మంత్‌రెడ్డి(79) సోమవారం మృతి చెందారు. అల్లోల చిన్నమ్మ-నారాయణరెడ్డిల మొదటి కుమారుడు హన్మంత్‌రెడ్డి కాగా.. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయన స్వగ్రామమైన ఎల్లపెల్లి గ్రామంలో సాయంత్రం 5 గంటలకు అంత్యక్రియలను నిర్వహించారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి సోదరుడు కాగా.. ప్రజాసేవా కార్యక్రమాల్లో హన్మంత్‌రెడ్డి చురుకుగా పాల్గొనేవారు. మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మితోపాటు ఎమ్మెల్సీ దండే విఠల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ జాదవ్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ మంత్రి జోగు రామన్న, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తోపాటు మాజీ బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌లు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అల్లోల హన్మంత్‌రెడ్డి

మానసిక వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు

బాసర, ఫిబ్రవరి 19 : మానసిక వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహద పడుతాయని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ అన్నారు. ఆర్‌జీయూకేటీలో సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఒత్తిడి, పరీక్షలంటే భయం, ఆందోళనల వంటివి సాంస్కృతిక కార్యక్రమాలతో అదుపులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సెలింగ్ డిపార్ట్‌మెంట్ కౌన్సిలర్ నాగలక్ష్మి, శివకుమార్, శ్రీలక్ష్మి, చీఫ్ వార్డెన్ శ్రీధర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ సతీశ్ కుమార్

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

యువత స్ఫూర్తిగా తీసుకోవాలి..

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : శివాజీ మహారాజ్ ఆశయాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని రణదీవ్యనగర్‌లో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రామన్న తన సొంత ఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. శివాజీ చిన్న వయసులోనే శత్రువులను సంహరించారన్నారు. తన మాతృమూర్తితోపాటు గురువుల మార్గ నిర్దేశనంలో నడిచి ప్రజారంజక పాలన సాగించారని తెలిపారు. సతీ సహగమనాన్ని రూపుమాపడానికి పాటుపడ్డారని పేర్కొన్నారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌లకు స్థానికులు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్ కోవ రవి, నాయకులు రాంకుమార్, కుమ్ర రాజు, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

శివాజీ విగ్రహం ఆవిష్కరణ

తానూర్, ఫిబ్రవరి 19 : ఎల్వీ గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శివాజీ సూచించిన బాటలో నడవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో కొనసాగాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు నారాయణ్‌రెడ్డి, బాలాజీ సూత్రవే, మండల కన్వీనర్ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 19 : ఈనెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మల్ జిల్లాలో పరీక్షలు రాయడానికి 23 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్‌అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, ఇంటర్మీడియట్ అధికారి పరశురాంనాయక్‌లు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి ఏర్పాట్లు పూర్తి..

ఈనెల 21వ తేదీన నిర్మల్ జిల్లా కేంద్రంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జయంతి వేడుకల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

బంజారా సంప్రదాయ పద్ధతిలో మల్లన్నగుట్ట వద్ద వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. భోజన సౌకర్యం కల్పించాస్తామన్నారు. బారికేడ్లు, టెంట్లు, మరుగుదొడ్లు, వైద్య సేవలపై అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి అంబాజీనాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

హాజరైన అధికారులు

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలు 30 ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం 11,666, ద్వితీయ 9,861 మొత్తం 21,527 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అలాగే పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగుతాయని, రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయని వివరించారు. 53 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని.. 10,507 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

సకల సౌకర్యాలు కల్పించాలి..

పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. పల్లెల్లోని విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ ఆర్ఎంకు సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఈవో ప్రణీత, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

అర్జీలను పరిష్కరించాలి..

నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 19 : ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం 36 అర్జీలు వచ్చాయని, అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, ఫిబ్రవరి 19 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అర్జీదారుల సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావు, ఏవో రాంబాబు, జిల్లా అదనపు వైద్యాధికారి బాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా